క్లుప్తంగా

శివ నామస్మరణతో మార్మోగిన గురజాల



గురజాల : పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న యేచూరి వారి బజారులో మాదాల శ్రీనివాసరావు సతీమణి కుమారి ఆధ్వర్యంలో వివిధ మాలదారులు భజనా కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన స్టేజీపై శివ స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి, పూజలు నిర్వహించారు. స్వామి వారికి 18 రకాల అభిషేకాలతో పాటు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు సుధాకర్ పాల్గొన్నారు.

సాగరమాత ఆలయంలో భక్తుల ప్రార్థనలు



విజయపురిసౌత్: స్థానిక సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ మాట్లాడుతూ సర్వ మానవ పాపాలను తొలగించేందుకు దైవ కుమారుడైన ఏసుక్రీస్తు మానవరూపాన్ని ధరించి సమస్త జీవకోటి ఆచరించాల్సిన విధి, విధానాలను వెలుగులోకి తెచ్చారని వెల్లడించారు. ఏసుక్రీస్తు సూచించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. దైవ సందేశాన్ని పాటించి సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందాలని చెప్పారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తేరు ప్రదక్షిణ లో భక్తులు భారీగా పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గంద్రకోట శ్రీనివాసరావు




మాచర్ల: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గంద్రకోట శ్రీనివాసరావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శీలం వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రధానకార్యదర్శిగా గంగుల శ్రీనివాసరావు, కోశాధికారిగా షేక్ జాని, ఉపాధ్యక్షుడిగా షేక్ గౌస్ పాషా, మహిళా ప్రతినిధిగా శీలం మాధవి ఎంపికైనట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ ఎన్నికల నిర్వాహణలో భాగంగా ఎన్నికల్లో వీరంతా ఏకగ్రీవంగా ఎంపికైనట్లు తెలిపారు. న్యాయ వాదులు అభినందించారు.

రింగురోడ్డు సెంటర్‌లో పారిశుద్ధ్యం



మాచర్ల: పట్టణంలో రింగురోడ్డు సెంటర్, యాదవ బజార్‌లో ఆదివారం మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పారిశుద్ధ్య పనులు చేయించారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా ఉదయం 5.30గంటల నుంచేపలు వార్డుల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేసిన అనంతరం బ్లీచింగ్ చల్లించి ఆ ప్రాంత సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బీజేపీ పట్టణ అధక్షుడిగా కేతావత్ శ్రీనివాస్



పిడుగురాళ్ల: పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా స్థానికుడు కేతావత్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తూ కృషి చేస్తానని చెప్పారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్, బీజేపీ నాయకులు సుధాకర్‌బాబు, శ్రీనివాస్‌యాదవ్, కేతనబోయిన హనుమంతరావు, రవిశంకర్, వడ్లమూడి వెంకయ్య, ఉమామహేశ్వరావు, కాశీవిశ్వనాథం రాము తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

చేతి‘కంది’తేగా..!

- ముంచిన మంచు
- దిగుబడులపై రైతుల బెంగ
- ఎకరానికి 2 నుంచి మూడు క్వింటాళ్లేనా!
- ఆందోళన చెందుతున్న రైతులు



కనమర్లపూడి పూత దశలో ఉన్న కంది పంట

శావల్యాపురం: కంది పంట సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ ఏడాది వాతావరణంలో పెనుమార్పుల వల్ల మంచు ప్రభావం ఎక్కువగా ఉండడంతో కంది పూత రాలిపోయింది. దీనికి తోడు చల్లని గాలులకు దిగుబడులు భారీగా తగ్గే అవకాశం ఉందని రైతులు నిరాశకు గురవుతున్నారు. వినుకొండ నియోజకవర్గంలో ఖరీఫ్, రబీ సీజన్లలో 4 వేల హెక్టార్లు కంది పంటను రైతులు సాగు చేశారు. శావల్యాపురం మండలంలో 700 ఎకరాలు సాగు చేశారు. ఒక్కో ఎకరానికి రూ.15 వేల రూ.25 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. దిగుబడులు మాత్రం ఎకరానికి 2 నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల తీవ్ర నష్టాలు తప్పని రైతులు ఆందోళన చెందుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దుర్భరంగా ఉందని చెబుతున్నారు.

కంది రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ ఏడాది రెండు ఎకరాల్లో కంది పంట సాగు చేశా. వాతావరణంలో మంచు వల్ల ఎకరానికి 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడులు వచ్చే పరిస్థితి లేదు. ఒక్కో ఎకరానికి రూ. 25 వేలకుపైగా పెట్టుబడులు పెట్టాను. ఇలాంటి సమయాల్లో ప్రభుత్వం రైతుకు అండగా ఉండాలి.

– చెవల వెంకటేశ్వర్లు, శావల్యాపురం రైతు

మద్దతు ధరకు కొంటాం



కంది రైతులు రైతుసేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో నాణ్యాత ప్రమాణాలు ఆధారంగా వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో మార్క్‌ఫెడ్ వారి సౌజన్యంతో కందుల మద్దతు ధర క్వింటా రూ.7550లు కొనుగోలు చేస్తారు. వాతావరణం ప్రభావం వల్ల దిగుబడులు తగ్గుతున్నాయి.

– బోయపాటి రవిబాబు, ఏడీఏ, వినుకొండ

సేవాలాల్ ఆలయం వద్ద కరపత్రాల అవిష్కరణ



కర పత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్త పాండు నాయక్

విజయపురిసౌత్: ఈ నెల 15న సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని పురస్కరించుకుని విజయపురిసౌత్‌లోని సేవాలాల్ ఆలయం వద్ద జరిగే వేడుక కరపత్రాలను ఆలయ ధర్మకర్త కరంటోత్ పాండు నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం పాండు నాయక్ మాట్లాడుతూ ఈ నెల 15న స్థానిక ఆలయంలో సేవాలాల్ మహారాజ్ జయంతిని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ భీమా నాయక్, గిరిజన విద్యార్థి విభాగం(జీవీఎస్)రాష్ట్ర అధ్యక్షుడు కేతావత్ పాండు నాయక్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీను నాయక్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మాచర్ల : మాచర్ల పట్టణంలో జెడ్పీహెచ్ బాలికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 1979–80లో 10వ తరగతి వరకు విద్యార్థులు మళ్లీ ఒక్కటై.. చిన్ననాటి స్మృతులను నెమరువేసుకున్నారు. 2013లో మొదటిసారిగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా మళ్లీ ఇప్పుడు అందరూ ఒక్క చోట చేరారు. న్యూటన్స్ ఇంజినీరింగ్ కాలేజి కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, అనంతపురం జిల్లా మలేరియా అధికారి ఓబుతో పాటు అనేక మంది అధికారులు..తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

విజయవంతమైన ‘మెగా కార్డియాక్’



రోగులకు మందులు అందజేస్తున్న నిర్వాహకులు

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో శ్రీవాసవి కల్యాణ మండపం నందు రోటరీ క్లబ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ, శ్రీబాలాజీ హాస్పటల్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా కార్డియాక్ (గుండె) మెడికల్ క్యాంపు విజయవంతమైంది. పల్నాడు ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో పేషెంట్లు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. పద్మశ్రీ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే, డాక్టర్ భవనాశి కాశీవిశ్వనాథం ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేసారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు, సెక్రటరీ నీరుమళ్ల రాజేష్, ట్రెజరర్ గుర్రం కృష్ణకాంత్, వంకాయల గోపి, పచ్చిపులుసు పాపయ్య గుప్తా ఆర్యవైశ్య పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా ఖాదర్‌బాబా ఉత్సవాలు

వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని మార్కాపురం రోడ్డు పసుపులేరు బ్రిడ్జి కోల్డ్ స్టోరేజ్ వద్ద ఖాదర్ బాబా ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున రావు పాల్గొని ఖాదర్ బాబా జెండా వద్ద బాబా విగ్రహానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. కొప్పురావూరి బాబా వరప్రసాద రావు, కాసుల గురునాథం, దోసపాటి బాబు, బండి వెంకటేశ్వర్లు, సుభాని మాస్టర్ (రవీంద్రస్కూల్), మేడం అశోక్, వి. మంగారావు, గంగిశెట్టి జగదీష్ బాబు, కాకుమాను రామారావు, చీమకుర్తి రత్నాకర్, బాబా కోటేశ్వరరావు, గర్రె నరసింహారావు, గుంటకల నాగేశ్వరరావు, బద్రీనాథ్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

త్రైత సిద్ధాంత ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంతాలను ఇంటింటి ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ మాఘ మాసంలోని మాఘ పూర్ణిమ, రథ సప్తమి, శివరాత్రి పండుగల విశిష్టతను తెలియజేశారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక అంశాలను భక్తులకు వివరించారు. జ్ఞానవేదిక అధ్యక్షుడు కటికం సైదారావు, సభ్యులు యుద్ధనపూడి వీరాంజినేయులు, గంగయ్య, శ్రీను, కార్తీక్, అరుణ, నారాయణమ్మ, వీరయ్య, రామాంజినేయులు,వెంకటేశ్వరనాయక్ సుందరం పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

నాదెండ్ల: గుట్టుచప్పుడు కాకుండా సుబాబుల్ తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు గణపవరం రెవెన్యూ పరిధిలోని కుప్పగంజివాగు సమీపంలో సుబాబుల్ తోటలో పేకాడుతున్నారంటూ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ప్రణాళికతో సిద్ధమైతే ఎన్‌సీసీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు



అవగాహన సదస్సుకు హజరైన గ్రూప్ కమాండర్ కల్నల్ చంద్రశేఖరరావు తదితరులు

నరసరావుపేట రూరల్: ప్రణాళికతో సిద్ధం కావడం ద్వారా ఎన్‌సీసీ బీ,సీ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం.చంద్రశేఖర రావు తెలిపారు. ఈనెలలో ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు నిర్వహించనున్న బీ, సీ సర్టిఫికేట్ పరీక్షల కోసం సిద్ధమయ్యే క్యాడెట్స్‌కు ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కల్నల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సమయపాలనతో, రోజు వారి అభ్యాసన వల్ల పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని వివరించారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, నాయకత్వ లక్షణాలు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, జనరల్ అవేర్నెస్, హెల్త్ అండ్ హైజన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వర్క్‌షాప్‌కు పట్టణ పరిధిలోని పలు కళాశాలల నుంచి 250 మంది క్యాడెట్స్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఆఫీసర్ మేడికొండ రాజేష్ బాబు, ఇతర కళాశాలల ఎన్‌సీసీ అధికారులు మేజర్ బీఎస్ఆర్‌కే రాజు, వై.అంజిరెడ్డి, 23వ ఆంధ్రప్రదేశ్ బెటాలియన్ సుబేధార్ ముకేష్‌కుమార్, హవల్దార్ దీప్‌కుమార్ పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

నాదెండ్ల: అదనపు కట్నం కోసం భర్త, అత్తింటి వారు వేధిస్తూ హింసిస్తున్నారని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు గణపవరం గ్రామానికి చెందిన శ్రీమాధురిచౌదరికి హైదరాబాద్‌కు చెందిన కృష్ణకిరణ్‌తో 2019 ఫిబ్రవరిలో వివాహమైంది. అప్పటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలంటూ తనను వేధిస్తున్నారంటూ భర్త కృష్ణకిరణ్, అత్తామామలు శశిప్రసాద్, పద్మజారాణి, తాత మల్లికార్జున రావులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సేవా పురస్కారాల అందజేత

చిలకలూరిపేట: సేవా కార్యక్రమాలు చేసేవారిని గుర్తించి పురస్కారాలు అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ హాలులో జయజయసాయి ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న పలువురికి సాయిసేవా భగవాన్ సేవా పురస్కారాలను ఆదివారం అందజేశారు. పలు సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్టు అధ్యక్షుడు పూసపాటి బాలాజి సేవలను కొనియాడారు.

ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బంది కొరత



నూజెండ్ల ఎంపీడీవో కార్యాలయం

నూజెండ్ల: నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయం, సచివాలయ పరిధిలో సిబ్బంది కొరతతో అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో జరగటం లేదని ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 27 గ్రామపంచాయతీలు ఉండగా ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు కాకపోవటం చేయాల్సిన పనులకు గుత్తేదారులు ఆసక్తి చూపటం లేదు. మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ సెలవుపై వెళ్ళారు. కార్యాలయంలో సూపరింటెండెంట్ పోస్టు భర్తీ చేయలేదు. సీనియర్ అసిస్టెంట్ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. కంప్యూటరు ఆపరేటరు దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళారు. కార్యాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవటం మండలం అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో బిల్లులు చెల్లింపులు జరగటం లేదని ఎంపీడీవో, ప్రజాప్రతినిధుల మధ్య వాగ్వివాదం జరిగింది. ప్రతి సచివాలయాల్లో 10 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ముగ్గురు, నలుగురుతో కాలం వెళ్ళబుచ్చుతున్నారు. సచివాలయంలో కీలక పాత్ర పోషించాల్సిన డిజటల్ అసిస్టెంట్స్ సేవలు కూడా నామమాత్రంగా అందుతున్నాయి. మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు కూడా సెలవుల్లో కొనసాగుతూ ఉండటం విశేషం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది కొరతను భర్తీ చేయాలని మండల ప్రజలు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

సత్యసాయి శత జయంతి వేడుకలు



చీరలు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా కమిటీ సభ్యులు

కారెంపూడి: సత్య సాయిబాబా శత జయంతిని స్థానిక సత్య సాయి సేవాసదన్‌లో ఆదివారం నిర్వహించారు. సత్యసాయి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదల అభ్యున్నతికి సమాజం సవ్య దిశలో పయనించడానికి ఆయన చేసిన ఉపదేశాలు అపూర్వమని సేవా సదన్ నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం కారెంపూడి తండాకు వారు తరలివెళ్లి అక్కడ వంద మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా కమిటీ, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు సత్యసాయి భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా నిత్య సహాయ మాత ఆలయ వార్షికోత్సవాలు



నిత్య సహాయ మాత దేవాలయంలో పూజలు

మాచర్ల: పట్టణంలోని రింగురోడ్డు ప్రాంతంలో ఆర్‌సీఎం దేవాలయంలో నిత్య సహాయ మాత దేవాలయ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆర్‌సీఎం చర్చి పాస్టర్, విచారణ గురువులు కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి ఆధ్వర్యంలో పతాక ఆవిష్కరణ నిర్వహించారు. పలువురు క్రైస్తవ భక్తులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ నెల 14వ తేదీ వరకు చర్చిలో నిత్య సహాయ మాత వేడుకలను నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ప్రత్యేక ప్రార్థన జరుపుతారు. అందులో భాగంగా ఆదివారం పాస్టర్ రఫేల్ రెడ్డితో పాటు, పెద్దలు ఎస్.సుందరరావు, జి.కిరీటి రెడ్డి, జె.మర్రెడ్డి, ప్రేమ్ కుమార్, గాంధీ, సిస్టర్లు తామాసమ్మ, సుజాత, ఇన్నమ్మ, ఇన్నారెడ్డి ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం చర్చి ప్రాంగణంలో క్రైస్తవ భక్తులకు ప్రత్యేక ప్రార్థనలనంతరం విందు నిర్వహించారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత సత్తెనపల్లి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న యరపతినేని నిఖిల్

పిడుగురాళ్ల: పట్టణంలోని స్కాలర్స్ డిగ్రీ కాలేజీలో నెల రోజులుగా నిర్వహిస్తున్న యరపతినేని లక్ష్మయ్య మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో సత్తెనపల్లి క్రికెట్ టీం విన్నర్‌గా నిలిచి మొదటి బహుమతి రూ.లక్ష నగదు గెలుచుకుంది. రన్నర్ వేటపాలెం క్రికెట్ టీమ్‌కు రూ.రూ.60 వేలు అందజేశారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యరపతినేని నిఖిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో క్రీడా ప్రాంగణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. విజేతలు, క్రికెట్‌లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా క్రాంతి, బెస్ట్ బౌలర్‌గా మూసా ఎంపికై బహుమతులు అందుకున్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగా శ్రీను, సర్వేశ్వరావు, కనిగిరి శ్రీను, పిల్లి చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యం ఎంతో ముఖ్యం

మాచర్ల: ప్రతి మనిషి ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో ఆరోగ్యంగా ఉండాలని, జీవిత ప్రమాణాన్ని పెంచుకోవాలని హైదరాబాద్‌కు చెందిన యశోద హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు కిషన్, పుష్పారెడ్డి, కృష్ణా జనరల్ హాస్పిటల్ గుర్రం రాజశేఖర్ అన్నారు. ఆదివారం సాగర్ రోడ్డులోని వైభవ్ రెసిడెన్సీలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ ప్రాక్టీస్ అసోసియేషన్ గ్రామీణ ప్రాంత వైద్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వైద్యుల సేవలు అభినందనీయమన్నారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం వివిధ ప్రాంతాలకు తరలించి గ్రామీణ ప్రాంత ప్రజల జీవితాలను కాపాడుతున్న వైద్యుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. మాచర్ల డివిజన్, ఆర్ఎంపీ, పీఎంపీ, వైద్యుల గౌరవాధ్యక్షుడు రాజ్ సిద్ధార్థ, వైద్యులు రామారావు, నాగేశ్వరరావు, సిద్దయ్యాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వందలాది మందికి అవగాహన కల్పించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస రాజు, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, కార్యదర్శి శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

వైభవంగా నందికుంట విఘ్నేశ్వరుని గుడి వార్షికోత్సవం



దేవాలయం వద్ద హోమంలో పాల్గొన్న భక్తులు



ఆకట్టుకున్న మహిళల కోలాట ప్రదర్శన



ఆలయం వద్ద భారీ అన్నదానం

నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులోని చారిత్రాత్మక నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ముందుగా స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి మండపారాధన నిర్వహించారు. నవగ్రహ పూజలు నిర్వహించి లక్ష్మీగణపతి హోమం, మహన్యాసకపూర్వక రుద్రాభిషేకం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలూ కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సుమారు రెండు శతాబ్దాల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతులు ఆలయానికి ఎడ్లబండ్లతో తరలివచ్చి పూజలు నిర్వహించి ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ప్రభలు తరలించి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పిస్తే సకాలంలో వర్షాలు కురుస్తాయని రైతులకు ప్రగాఢ విశ్వాసం. కుటుంబంలో ఏ చిన్న కార్యక్రమం జరిగినా విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రారంభిస్తారు. వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకూ ఒంగోలు జాతి వృషభరాజాల బలప్రదర్శన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. సత్తెనపల్లికి చెందిన ముక్కపాడు బ్రహ్మం ఆధ్వర్యంలో నాదెండ్ల, పొనుగుపాడు, కండ్లగుంట, చాగంటివారిపాలెం, లింగారావుపాలెం గ్రామాలకు చెందిన మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.





ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

ఇంటర్ ఫైనల్ పరీక్షలకు రంగం సిద్ధం..

- నూరుశాతం ఫలితాలకు ఉపాధ్యాయులు కృషి
- మార్చి 1 నుంచి ఫైనల్ పరీక్షలు ప్రారంభం



తరగతి గదిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలో 2024–25 విద్యా సంవత్సరంలో బాలికల జూనియర్ కళాశాల్లో ఇంటర్మీడియట్ ఫైనల్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత శాతం వచ్చేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టారు. సోమవారం నుంచి ఇంటరు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరుగుతాయి.ఇందులో భాగంగా ప్రీఫైనల్ పరీక్షలు పూర్తి కావటంతో ఫలితాలు ఆధారంగా విద్యార్థినులను గ్రేడులుగా విభజించి మంచి ఫలితాల సాధనకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటరు మొదటి సంవత్సరం 37 మంది, ఇంటరు ద్వితీయ–32 మంది బాలికలు మార్చి 1వ నుంచి ప్రారంభం కానున్న ఫైనల్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వీరికి ఉదయం, సాయంత్రం వేళల్లో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు